నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 25 జులై 2023

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో రాజేంద్రకుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కే.రాజేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్డీఓకు స్వాగతం పలికారు. నిజామాబాద్ ఆర్డీఓ గా కొనసాగిన రవికుమార్ ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో సూర్యాపేట ఆర్డీవోగా పనిచేసిన కే. రాజేంద్రకుమార్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు ఆర్డీఓ రాజేంద్రకుమార్ సోమవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో

బెల్లాల్ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న రాజేందర్ గౌడ్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించుట, కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందున తాత్కాలికంగా విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. మే నెలలో క్షేత్ర సహాయకులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూలీలకు పనులు కల్పించాలని జిల్లా అధికారులు ఆదేశించినా కూలీలకు పనులు కల్పించడంలో ఎలాంటి పురోగతి కనిపించలేదని తెలిపారు.అలాగే సోమవారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్ష సమావేశానికి హాజరుకానందున ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా అధికారి చందర్ తెలిపారు. తదుపరి తాత్కాలిక ఫీల్డ్ అసిస్టెంట్ ను నియమించుకొని కూలీలకు పనులు కల్పించాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఫిర్యాదుల వెల్లువ

- ఇరుజిల్లాలో ప్రజావాణికి పెరుగుతున్న ఫిర్యాదులు, వినతులు
- నిజామాబాద్‌లో 139, కామారెడ్డిలో 83 వినతులు
- ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ


నిజామాబాద్‌లో ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తున్న అధికారులు..


కామారెడ్డిలో..

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి(తాడ్వాయి)

ఇరు జిల్లాల్లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నిజామాబాద్‌లో 139 ఫిర్యాదులు అందగా, కామారెడ్డిలో 83 వినతులు అధికారులు స్వీకరించారు. వీటిల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే ఫిర్యాదులు అందినట్టు సమాచారం. కాగా ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు, వినతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్‌లు అధికారులకు ఆదేశించారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారు లను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉన్నందున దరఖాస్తుల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి 139 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఏ శాఖల్లో ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయనే వివరాలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డి వెల్లడిస్తూ, వారంలోపు వాటన్నింటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కామారెడ్డి(తాడ్వాయి) :

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు స్పందించి, సత్వర పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు.

సోమవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించి, అట్టి దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 83 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాయన్న , ఏవో రవీందర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట లబానా లంబాడీల ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన లబానా లంబాడీలు

లాబానా లంబాడీలకు పోడు భూములకు సంబంధించిన పట్టాలు ఇవ్వాలని, ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. అనంతరం జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా లాబానా లంబాడీల రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో లాబానా లంబాడీలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయిందన్నారు. లాబానా లంబాడీలకు పోడు భూములు ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఎన్నికలు వచ్చిన సమయంలోనే లాబానా లంబాడీలు గుర్తుకు వస్తారన్నారు. తమను ఎన్నికలకోసమే వాడుకుంటూ మోసం చేయడం అలవాటుగా మారిందన్నారు. సీఎం కెసిఆర్ ఎన్నికల సమయంలో పోడు భూములు ఇస్తామని, ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మాట తప్పాడన్నారు. తమను మోసం చేసే పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.

డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ప్రభుత్వ డైట్ కాలేజీ విద్యార్థులను వేధిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ.. తనకు అనుకూలమైన వ్యక్తులకు సపోర్ట్ చేస్తూ, తన మాట వినని విద్యార్థులను టార్గెట్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. గతంలో చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ముగ్గురు సభ్యుల కమిటీతో ఎంక్వయిరీ చేయించారని, కానీ ఆ రిపోర్టు తేల్చిందేమిటో ఎవరికి తెలియదన్నారు. డైట్ ప్రిన్సిపల్ తన రాజకీయ, ఆర్థిక బలంతో ఎంక్వయిరీ కమిటీని మేనేజ్ చేశారని భావిస్తున్నామన్నారు. అందువల్లే విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ మరింత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనేక సంవత్సరాలు నుండి బదిలీలు లేకుండా ఇక్కడే తిష్ట వేస్తూ విద్యార్థులను వేధిస్తున్న డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు నాయకులు గణేష్ తరుణ్, లక్ష్మణ్, సామ్యూల్, అలియన్, జునైద్, ఉమాశ్రీ, హారిక, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రమాదమైనా.. తప్పట్లే


ప్లాస్టిక్ బాటిళ్లలో నీళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని తెలిసినా కొన్ని సందర్భాల్లో తప్పనిసరిగా ఉపయోగించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగుదామంటే స్వచ్ఛమైన నీరు లేకపోవడంతో మధ్యాహ్న భోజన సమయంలో ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ఇంటి నుంచే ప్లాస్టిక్ బాటిళ్లల్లో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం చిన్నపిల్లలు తాగడానికి స్వచ్ఛమైన మంచినీరు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదమని తెలిసిన పిల్లలకు ప్లాస్టిక్ బాటిల్లో మంచినీరు పోసి ఇవ్వాల్సి వస్తుంది. ఇకనైనా విద్యార్థు లకు స్వచ్ఛమైన తాగే నీరును ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

- ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసు వివరాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణ, దొంగతనాల రికవరీలో ఎస్సై, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అంతకుముందు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్సై అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ డిమాండ్

నవతెలంగాణ-దోమకొండ


మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

దోమకొండ మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఇంటర్ జూనియర్ కళాశాల వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దోమకొండ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని గత తొమ్మిది ఏళ్ల నుండి కాలయాపన చేస్తు ఇచ్చిన హామీ విస్మరించిందని, దోమకొండ మండలంతో పాటు చుట్టూ పక్కన్న ఉన్న మండలల గ్రామాల నుండి వేల మంది విద్యార్థులు డిగ్రీ చదవడానికి కామారెడ్డి జిల్లా కేంద్రానికి అనేక ఇబ్బందులు పడుతూ వెళుతున్నరని తెలిపారు. కొంత మంది విద్యార్థులు దూర ప్రయాణం, ఇతర ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. కామారెడ్డి జిల్లాలోని మద్నూర్ మండలానికి డిగ్రీ కాలేజీ మంజూరైందని, కానీ ఇక్కడి విప్ మాత్రం దోమకొండకు డిగ్రీ కాలేజీ మంజూరు చేయించలేదని అన్నారు. తమ హయాంలో దోమకొండకు జూనియర్ కాలేజీని, ప్రభుత్వ ఆసుపత్రిని నెలకొల్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇంద్ర కరణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు అనంతరెడ్డి, నాయకులు అబ్రబోయిన స్వామి, సంపత్, చందు, రమేష్, మధు, రామ స్వామి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు పెండింగ్ ఉంటే చెప్పండి

- స్పీకర్ పోచారం సమీక్ష

నవతెలంగాణ-కోటగిరి



సమీక్షలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి ఉమ్మడి మండలంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభివృద్ధి పనులపై రైతు వేదికలలో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహిం చారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై వార్డుల వారీగా నాయకులతో వివరాలు సేకరించారు. నిలిచి పోయిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని సూచించారు. కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు, వికలాంగులకు నాలుగు వేల రూపాయలు కలిగించడంతో హర్ష వ్యక్తం చేస్తూ కేసీఆర్, పోచారం చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం నిర్వహించారు. వారిని పోచారం శ్రీనివాస్ రెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, ఏసీపి కిరణ్ కుమార్, ఎంపీపీ సునీత శ్రీనివాసులు, జడ్పిటిసి శంకర్ పటేల్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను సన్మానించిన వీఆర్ఏలు

పే స్కేల్ అమలుపరిచి, ఉద్యోగ భద్రత కలిగించినందుకు వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్


ప్రారంభోత్సవం చేస్తున్న విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధిరామేశ్వర నగర్ గ్రామంలో 78 లక్షల 20 వేల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్న గ్రామాలను పంచాయ తీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతు ందని, భారత దేశంలో ఎక్కడలేని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని, ఈ నెల నుండి దివ్యాంగుల పింఛన్ వెయ్యి రూపాయలు పెంచినట్టు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా వాటిని దశలవారీగా పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, జెడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, ఎంపిటీసి మీనా దుర్గబాబు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ లింగాల కిష్టా గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంత్ రెడ్డి, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యురాలు మాధవి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నరసింహ రెడ్డి, సిద్ధిరామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- 63.1 టీఎంసీల చేరిన నీటిమట్టం
- జూన్1 నుంచి 44.7 టీఎంసీల చేరిక

నవతెలంగాణ-మెండోరా/జుక్కల్


నిండుకుండను తలపిస్తున్న ఎస్సారెస్పీ..


జుక్కల్ : కౌలాస్‌నాళా వరద కాలువకు నీటి విడుదల

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, రాత్రి 8 గంటల సమయానికి కొంత మేర తగ్గి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(90.3 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1083.30 అడుగుల (63.185 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో నీటిమట్టం 1087.60 అడుగుల (75.146 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎస్సారెస్పీకి 44.751 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అందులో రివర్స్ పంపింగ్ ద్వారా 2.53 టీఎంసీల నీరు ప్రాజెక్టులకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కౌలాస్‌నాళా ప్రాజెక్టు నీటి విడుదల

జుక్కల్ : జుక్కల్ మండల వరప్రదాయని కౌలాస్ నాళా ప్రాజెక్టు నుండి వరద కాలువ ద్వారా సోమవారం జుక్కల్ మండల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నీటిని విడుదల చేశారని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ రవిశంకర్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిండిపోవడంతో ప్రస్తుతం జలకళ సంతరించుకుందని, ఇన్ ఫ్లో ద్వారా ఒకవంద పదిహేను క్యూసెక్కులు నీరు వచ్చి చేరిందని, ప్రాజెక్టు కింద వరి సాగు చేస్తున్న రైతుల నాట్లు ఊపందుకోవడంతో నీరు తక్కువ పడొద్దనే ఉద్దేశ్యంతో చెరువులు, కుంటలు నింపేందుకు వీలుగా ప్రాజెక్టు కాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషన్ పోవార్, మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీలు పటేల్, మాజీ ఎంపిపి బస్వంత్ రావ్ శెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దాదారావ్ పటేల్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖిల్లా జూనియర్ కాలేజీలో రిక్రూట్ మెంట్ డ్రైవ్

డీఐఈఓ రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హైదరాబాద్‌లోని ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నికల్ ట్రైని ఉద్యోగాల భర్తీ కోసం రిక్రూట్మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేశామని డిఐఈఓ రఘురాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని ఖిల్లా జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఫార్మా టెక్ కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా రిక్రూట్మెంట్ డ్రైవ్‌కు హాజరు కావచ్చని సూచించారు. అభ్యర్థులు పదవ తరగతిలో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియట్లో 50 శాతం మార్కులు సాధించి ఓకే విడతలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 20 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండు సంవత్సరాలు ఉచిత వసతితో పాటు సబ్సిడీ క్యాంటీన్ సౌకర్యాన్ని వర్తింపజేస్తూ నెలకు 11వేల రూపాయల వేతనం చెల్లిస్తారని వివరించారు. అలాగే కంపెనీ ద్వారా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి బీఎస్సీ డిగ్రీ చేసే వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ ఎస్ఎస్‌సి, ఇంటర్ మెమోలు, ఆధార్ కార్డు తో పాటు రెండు జతల జిరాక్స్ ప్రతులతో మంగళవారం ఉదయం 11.00 గంటలకు రిక్రూట్మెంట్ డ్రైవ్ కు హాజరుకావాలని డిఐఈఓ సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం సెల్: 9182063878, 7995549496 సంప్రదించాలని సూచించారు.

పల్లెప్రగతి నిరంతర ప్రక్రియ

- పనులు పరిశీలించిన అదనపు కలెక్టర్ మను చౌదరి


మాట్లాడుతున్న మను చౌదరి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో చేపట్టిన పల్లె ప్రగతి పనులు నిరంతర పక్రియ అని జిల్లా అదనపు కలెక్టర్ మను చౌదరి అన్నారు. దోమకొండ మండలం లోని అంచనూరు, సంగమేశ్వర్, సీతారాం పల్లి గ్రామాలలోని పల్లె ప్రగతి పనులు, ఉపాధి హామీ పనులు, ఇతర అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. పల్లెప్రగతిలో చేపట్టిన నిర్మాణాలు ప్రతి రోజు వినియోగంలో ఉంచాలని, గ్రామాల్లో ని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, హరితహారంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

గ్రామాల్లో వర్షాకాలం లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అంచనూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా అటవీ శాఖ అధికారిని నిఖిత, జిల్లా అదనపు కలెక్టర్‌ను ప్రజా ప్రతినిధులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత, జడ్పీటిసి తిర్మల్‌గౌడ్, డిఎస్పి ప్రకాష్,డిపివో శ్రీనివాస్ రావు, సర్పంచ్ లు నాంపల్లి, సమత, జెట్టబోయిన నరేష్,, ఎంపిఒ తిరుపతి రెడ్డి , ఏపిఒ రజనీ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఆరోగ్యబీమా, జీవితబీమా కల్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చక్రవర్తికి ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షాలో బోధన, బోధనేతర సిబ్బంది గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ఉద్యోగ క్రమబద్ధీకరణకు అన్ని విధాలుగా అర్హులమని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఏప్రిల్‌లో ఉద్యోగ క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించినా నేటి వరకు అమలు కాలేదని, రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, కాశిరామ్, శివకుమార్, శ్రీలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశం తలదించుకునేలా మణిపూర్ ఘటన :టీడీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతదేశం తలదించుకునే విధంగా మణిపూర్ ఘటన ఉందని టీడీపీ నిజామాబాద్ అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ మండిపడ్డారు. సోమవారం టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి లాంటి స్త్రీ మూర్తిని వివస్త్ర చేసి ఊరేగించడం కనబడట్లేదా అని ప్రశ్నించారు. పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. కులమతాల పేరుతో వ్యవస్థను దిగజార్చిన బిజెపి ప్రభుత్వంలో ఇంతటి అఘాయిత్యాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో లిక్కర్ కుంభకోణంలో చేసిన అవినీతిని కాపాడడానికి ప్రతి ఎమ్మెల్యే ఢిల్లీ చుట్టూ తిరిగారు. కానీ మణిపూర్ ఘటనపై ఏ ఒక్కరూ స్పందించలేదని, సాటి మహిళా అయిన ఎమ్మెల్సీ కవిత నేటికీ స్పందించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు అహ్మద్, శంకర్ ముదిరాజ్, నర్సయ్య, ఫిరోజ్, కలీమ్, ఇమ్రాన్ చాహుష్, ఎండీ ఇర్ఫాన్, గంగాధర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పురపాలక సంఘ కార్యాలయంలో చైర్పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో వర్షాకాలం దృశ్య పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ మాట్లాడుతూ.. ఈ సీజన్లో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వాటి లార్వాలు నిర్మూలించడం కోసం యాంటీ లార్వా స్ప్రేయర్ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సానిటరీ జవాన్లకి సూచించారు. ప్రజలు కూడా, చెత్తను బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పూర్ణమౌళి సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్ల నిర్మాణంలో..
బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

- పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ మహేష్ కొనగల
- వైఫల్యాలు బయటపడతాయనే పరిశీలనకు వెళ్లకుండా అరెస్టులు
- మానాలమోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

2014లో ప్రతి నియోజకవర్గంలో 5000 వరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని నిర్మించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని పిసిసి అధికార ప్రతినిధి, జిల్లాకు ఇన్‌ఛార్జిగా వచ్చిన డాక్టర్ మహేష్ కొనగల అన్నారు. కాంగ్రెస్ కట్టిన ఇండ్లు చిన్నగా ఉన్నాయని, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని కేసీఆర్ ఎన్నికల సమయంలో పేదలకు హామీ ఇచ్చాడని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలనలో భాగంగా నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించడానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశవేణు, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బీన్ హమ్దాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ప్రేమలత అగర్వాల్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, కార్పొరేటర్ గడుగు రోహిత్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళలను అరెస్టు చేశారన్నారు. కమిషన్లు వచ్చే నీటి ప్రాజెక్టుల్లో చూపించిన శ్రద్ధ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో చూపించడం లేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు



అరెస్టులపై నిరసన తెలుపుతున్న నాయకులు

పరిశీలించడానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసు బలగాలను మోహరించి పార్టీ కార్యాలయం నుండి కదలనివ్వకుండా అరెస్టు చేయించడం అనేది వారి నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మభ్య పెట్టిన కేసీఆర్‌కు పేద ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య, రాష్ట్ర ప్రచార కమిటీ ఈసీ మెంబర్స్ జావిద్ అక్రమ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రావు, దయాకర్ గౌడ్, పిసిసి కార్యదర్శి రాంభూపాల్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు పోల ఉష, తంబాకు చంద్రకళ,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా సేవల అధ్యక్షులు సంతోష్, పిసిసి మెంబర్ ఈసా, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, అబూద్ బీన్ హందాన్, నగర మైనారిటీ అధ్యక్షులు ఎజాజ్ ,నగర ఎస్టీ అధ్యక్షులు సుభాష్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ బొబ్బిలి, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టులు చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మీసాల సుధాకర్ రావు, దయాకర్ గౌడ్, ఆర్మూర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ ,నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుభాష్ జాదవ్ నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ఆగస్టు 7 నుండి మిషన్ ఇంద్రధనుష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

చిన్నారులు, గర్భిణీ మహిళలకు నూటికి నూరు శాతం వ్యాక్సినేషన్ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆగస్టు 7 వ తేదీ నుండి మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణీ మహిళలకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. వివిధ కారణాల వల్ల ఎవరైనా టీకాలు తీసుకోకుండా తప్పిపోయినట్లైతే, అలాంటి వారిని గుర్తించి వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని సాధించేందుకు మూడు విడతలుగా మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని డీఎంహెచ్ ఓ వివరించారు. మొదటి విడతగా ఆగస్టు 7 నుండి 12 వ తేదీ వరకు, రెండవ విడతగా సెప్టెంబర్ 11 నుండి 16 వరకు, మూడవ విడతగా అక్టోబర్ 9 నుండి 14వరకు మిషన్ ఇంద్రధనుష్ కొనసాగుతుందని తెలిపారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, టీకాలు వేయించుకొని చిన్నారులు, గర్భిణీలను గుర్తించి వ్యాక్సిన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇళ్లకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని, జిల్లాలో పూర్తి స్థాయిలో వ్యాక్సినేషన్ లక్ష్య సాధనకు తోడ్పాటును అందించాలని డీఎంహెచ్ఓ కోరారు.

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి అని భోజన లెఫ్ట్ పార్టీ (బిఎల్‌పి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర, కేంద్రంలోని బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాల డొల్లతనం బయటపడిందని విమర్శించారు. సోమవారంకలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రం లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశంలో దళిత బహుజన, మైనారిటీలపై దళిత , గిరిజన మహిళలపై హత్యలు, హత్యాచారాలు, దాడులు నిత్యకృత్యం అయ్యాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీలైన బహుజన జాతులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బామ్ సెఫ్ జాతీయ నాయకులు చెన్నయ్య, బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, మైనారిటీ నాయకులు షేక్ హుస్సేన్, బిఎల్పీ జిల్లా కన్వీనర్ కె.మధు, బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బిడిఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శ్రీమాన్, బీఎస్పీ జిల్లా నాయకులు యెడ్ల రాము, దళిత నాయకులు బంగారు సాయిలు, పులి జైపాల్, బిఎల్ పి నగర నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

మహిళ భవనానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గంగరమంద గ్రామంలోని మహిళా భవనానికి సర్పంచ్ ఆనుగు గంగాధర్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ భవనానికి రూ. 5 లక్షలతో భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి, ఎంపిపి మస్తా ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులు సరిపోవని చెప్పడంతో మళ్ళీ రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలి

- ఆర్మూర్ ఆర్డీవో వినోద్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ముప్కాల్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, వారి నుండి దరఖాస్తులు తీసుకోవాలని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ఓటర్ లిస్టును జాగ్రత్తగా, చక్కగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇందుకు వారి నుండి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో మృతి చెందిన, గ్రామం నుండి వెళ్లిపోయిన వారు ఉంటే వారి పేర్లను ఓటర్ లిస్ట్ నుండి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. అదేవిధంగా ఓటరు జాబితాలో ఏమైనా పేర్లలో, ఇంటిపేర్లలో, ఇంటి నంబరు, చిరునామాలలో తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు ఓటర్లకు అవగాహన కల్పించాలని బిఎల్ఓ లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యా లయం సూపరిండెంట్ మైలారం గంగాధర్, పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలోని నల్లూర్ గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు ఓటర్లకు ఎన్నికల సమయంలో ఓట్లు ఎలా వేయాలో, ఓటును ఏ విధంగా ఉపయోగించుకోవలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాం ఓటర్లకు తమ ఓటు హక్కు గురించి తెలిపారు. ఓటును అమ్ముకోకుండా నిజాయితీతో ఓటును వినియోగించుకోవాలని వివరించారు. ఓటు హక్కును గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, బిల్వోలు, పంచాయితీ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

పాశం కుమార్‌కు అభినందనల వెలువ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పాశంకుమార్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఇందల్ వాయి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాశం కుమార్ కు నిజామాబాద్ రూరల్ ఎస్సీ కన్వీనర్ గా ఆర్టీసీ చైర్మన్, నిజామబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియామకం చేయడం పాట్ల హర్షం వ్యక్తం చేస్తు సోమవారం ఇందల్ వాయి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ మండల ఉధ్యక్షులు చిలివేరి గంగా దాస్ అధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు తెలు విజయ్ కుమార్, చందర్ నాయక్, ఎంపిటిసి లు చింతల దాస్, మారంపల్లి సుధాకర్, ఢీ కోండ సుదిర్, పరుశురాం,రాజు నాయక్, బిఆర్ఎస్ మండల ఉధ్యక్షులు బీరిష్ శేట్టి,అంబర్ సింగ్ తోపాటు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి



మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రంలో రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక కోసం గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపీపీ మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో పేదల సొంతింటి కలలు నెరవేర్చేందుకు ఏ ప్రభుత్వము కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పథకాన్ని చేపట్టలేదన్నారు. ఎవ్వరికి ఒక్క పైసా లంచం ఇవ్వకుండా డబుల్ బెడ్ రూమ్ పొందుతున్నారని తెలిపారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుండి 47 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లో 27వ తేదీ వరకు లిఖిత పూర్వక ఆధారాలతో తెలిపాలని తహసిల్దార్ సురేష్ ప్రజలకు సూచించారు. అభ్యంతరాలను తహసిల్దార్ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, ఉప సర్పంచ్ పాలెపు చిన్న గంగారం, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన వరి కొనలు తుంచి నాటాలి

- మోతాదుకు మించి యూరియా వాడొద్దు
- మండల వ్యవసాయ అధికారి దేవిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ముదిరిన వరి కొనలు తుంచి నాటాలని అదేవిధంగా మోతాదుకు మించి యూరియా వాడరాదని మండల వ్యవసాయ అధికారి దేవిక అన్నారు. మండల కేంద్రంలో వరినాట్లను సోమవారం మండల వ్యవసాయ అధికారి దేవిక సందర్శించారు. వరివేసే ముందు నారు పీకే వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి ఒక కేజీ కార్బో ఫ్యూరన్ గుల్కలు వేయాలని సూచించారు. అదేవిధంగా ముదిరిన వరి నారు వేసినట్లయితే నారు కొనలు తుంచి కొద్దిగా దగ్గర దగ్గరగా నాటాలని సూచించారు. నాటిన వరి అంకురము నుండి చిరు పొట్ట దశలో తప్పనిసరిగా క్రాఫ్ట్ హైడ్రా క్లోరైడ్ ఎకరానికి 4జి గుళికలు 8 కిలోలు, క్లోరంట్రా నీలి ప్రోల్ 0.4 జి గుళికలు ఎకరానికి నాలుగు కిలోలు వేయాలని రైతులకు సూచించారు. యూరియా ఒక్కసారిగా కాకుండా దఫదఫాలుగా వేయాలని, మోతాదుకు మించి యూరియా వేయకూడదని తెలిపారు. కలుపు యాజమాన్యం సకాలంలో చేపట్టాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా కుంట సంజీవ్ పటేల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ పటేల్ ప్రతిపాదనతో కుంట సంజీవ్ పటేల్‌ని నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని సోమవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అందజేశారు. కొండదేవయ్య అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో జిల్లా కమిటీలను వేయాలని సూచించారు. మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలో కమిటీలు వేసి మున్నూరు కాపు ఐక్యతను చాటి చెప్పాలని వారన్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిని కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైడి చిన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, జిల్లా సెక్రటరీ గన్న లక్ష్మణ్, మైనారిటీ అధ్యక్షుడు సైకిల్ టెక్స్ అక్బర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అరిగెల అభిలాష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనక రవి, మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ నియమత్ అలీ, సుంకర శ్రీనివాస్, ఆకుల రవీందర్, ఉల్లెంగల గంగాధర్, గున్న బాలయ్య, అర్గుల్ పోశెట్టి, సురేష్, సాజిద్, తలారి డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి

- క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ రవీందర్
- క్షత్రియ ఖత్రి ఉత్తమ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



పురస్కారం అందజేసి సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

క్షత్రియ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి విశ్వనాథ్ రవీందర అన్నారు. శ్రీ సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి/పట్కరి) సమాజ్ ఆధ్వర్యంలో సమాజ్ అధ్యక్షులు హజారీ మదన్ మోహన్ అధ్యక్షతన సోమవారం పట్టణం లోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో క్షత్రియ ఖత్రి కులానికి చెందిన ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభ పురస్కార్ -2023 అందజేశారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ, ఎంబీబీఎస్‌లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన స్టూడెంట్స్‌ను ముఖ్య అతిథిగా క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు, ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విశ్వనాథ్ రవీందర్ చేతుల మీదుగా ఉత్తమ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యం, కృషి ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. చదువుతోనే కుటుంబం, సంఘం అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ అన్నారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని, ఉన్నత ఉద్యోగాలు చేయాలని కోరారు. ప్రాంతీయ సమాజ్ సలహాదారులు, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలన్నారు. క్షత్రియ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, పూజారి రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంక్ విష్ణు, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, కార్యదర్శి పండిత్ ప్రేమ్ తదితరులు మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సమాజ్ అధ్యక్షులకు శాలువా మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి దాతలుగా సమాజ్ ఉపాధ్యక్షులు జెస్సు ఆనంద్, క్షత్రియ విద్యాసంస్థలు ఉన్నారు. క్షత్రియ సమాజ్ అధ్యక్షులు హజారీ మదన్ మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్షత్రియ ప్రాంతీయ సమాజ్ సలహాదారులు అల్జాపూర్ లక్ష్మి నారాయణ్, రాష్ట్ర యువ సమాజ్ అధ్యక్షులు అధ్యక్షులు శివ పండిత్, ఆర్మూర్ క్షత్రియ సమాజ్ ప్రధాన కార్యదర్శి బారాడ్ గంగామోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు సంగీతా ఖాందేష్, బాదాం రాజ్ కుమార్, బారాడ్ రమేష్, జనార్దన్ రాజు, అల్జాపూర్ రేవతి, కార్యక్రమ కన్వీనర్ ఘటడి రాజేష్, ఉపాధ్యక్షులు రెడ్డి ప్రకాష్, కిషన్ గటడి, డీకే శ్రీనివాస్, కోశాధికారి సంజయ్ వైద్య సంయుక్త కార్యదర్శులు బాదాం రాజేందర్, షికారి శ్రీనివాస్, బారాడ్ కిషోర్, కార్యవర్గ సభ్యులు, యువజన సమాజ్ అధ్యక్షులు జీవీ ప్రశాంత్, కార్యదర్శి విశ్వనాథ్ శ్రీను రాజేష్, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సంబరాలు

కేసీఆర్, కేటీఆర్, ఆర్టీసీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ధర్పల్లి/జక్రాన్‌పల్లి



జక్రాన్‌పల్లి : పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

పేస్కెల్‌పై జీఓ జారీ చేయడంతో మండలం లోని వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు హరి చరణ్ మాట్లాడుతూ తమ దీర్ఘ కాళికా సమస్యను తీర్చిన కేసీఆర్ కు రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రాజు. దేవరం. బుచ్చన్న, శాంత, సరిత, శ్యామల, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి :రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు మండల వీఆర్ఏలు సోమవారం పాలాభిషేకం చేశారు. వీఆర్ఏలకు కేసీఆర్ పే స్కేల్ జీవో జారీ చేయడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు రొడ్డ సాయన్న మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ వర్తింపజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

సేవా, స్నేహం, సమ్మేళనం.. రోటరీ క్లబ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



ప్రమాణం చేసిన నూతన కార్యవర్గం

కంఠేశ్వర బైపాస్ నందుగల ఏఎస్ఆర్ హాలులో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 2023 24వ సంవత్సర నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించినట్టు నూతన అధ్యక్షులు జి. రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ జిల్లా 3150 గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి, గౌరవ అతిథిగా సిఎడిజిడి గౌతమ్, ఇండక్షన్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ గవర్నర్ వి శ్రీనివాసరావు హాజరయ్యారని అన్నారు. ముఖ్యఅతిథి, రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి రామకృష్ణ, ఎన్ ప్రసన్నకుమారి, రోటరీ ట్రస్ట్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ.. రోటరీ అంతర్జాతీయ సంస్థ సేవా స్నేహం సమ్మేళనం అనే అంశాలతో ముడిపడి ఉన్నదని వీటన్నిటిని వినియోగించి సభ్యులందరూ కలిసి ముందుకెళ్లి ఆత్మీయ బంధాన్ని ఏర్పరచుకోవాలని అన్నారు. డి గౌతమ్ మాట్లాడుతూ.. సేవ చేయాలని ఉద్దేశంతో ఉన్నటువంటి సభ్యులు అవకాశం వచ్చినప్పుడు వినియోగించుకొని ప్రజలకి మేలు జరిగే విధంగా ముందుకెళ్లాలని కోరారు. నూతనంగా క్లబ్ లోకి జాయిన్ అయిన సభ్యులకు ఇండక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రమాణం చేయించి ఆహ్వానం పలికారు. అధిక సంఖ్యలో రోటరీ మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

వీడీసీ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలో 5లక్షలతో నిర్మించ తలపెట్టిన నూతన విడిసి భవన నిర్మాణానికి సర్పంచ్ వెంకటేష్, విడిసి చేర్మెన్ కోతి శేఖర్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. గ్రామములోని విడిసి భవనం శిదిలావస్థకు చేరిందని నూతన భవనానికి నిధులు మంజూరు చెయ్యాలని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు కోరగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే 5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పెండ గంగాధర్, సభ్యులు గోవర్ధన్, గ్రామస్థులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. బిచ్కుంద డిగ్రీ కళాశాలలో తెలుగు 02, ఆంగ్లం 02, గణితశాస్త్రం 01, జంతుశాస్త్రం 01, కంప్యూటర్ సైన్స్ 01 సబ్జెక్టులకు గానూ సంబంధిత సబ్జెక్టులలో కనీసం 55 శాతం మార్కులు పొంది ఉండాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను ఈనెల 27వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలలోపు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందజేయాలని సూచించారు. వచ్చే నెల 1 నాడు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు తెలిపారు.

వెయ్యి మంది మైనార్టీలకు
రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తాం : ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నియోజకవర్గంలోని వెయ్యిమంది మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నట్టు ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ ద్వారా నిధులు మంజూరు చేయించిన ఆయన.. బీసీలు, కులవృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయంలో భాగంగా మైనార్టీలకు కూడా అందజేయాలని విన్నవించారు.

వెట్టిచాకిరి చేస్తున్నా పట్టదా..?

19వ రోజు కొనసాగిన జీపీ కార్మికుల, సిబ్బంది నిరవధిక సమ్మె

గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలు మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

వర్ని : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె 19వ రోజుకు చేరింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు బుడ్డక్కల సాయిలు, సాయిచరణ్, సాయవ్వ, లక్ష్మపూర్గం గంగారం, నర్సయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు..

కోటగిరి : పంచాయతీ కార్మికులకు బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల బాలరాజ్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన పోరాటాలు పెద్దఎత్తున నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్, కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ ఖాదర్, మైనార్టీ మండలాధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, ఎత్తొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తయ్యాబ్, షేక్ ఫిరోజ్ గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లి దిష్టిబొమ్మ దహనం..

ఎడపల్లి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ధర్నాచౌక్‌లో గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం ఒప్పందం చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కార్మికులు, సిబ్బంది తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. పారిశుధ్య కార్మికుల పట్ల, సిబ్బంది పట్ల ప్రభుత్వానికి ఎందుకంత నిర్లక్ష్యమని జిల్లా జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్ కో కన్వీనర్ కుంట సంతోష్, పాండు, గుణతేజ, వెంక గౌడ్ రాజు, పద్మావతి, గరిగింట్ల శ్రీనివాస్ పద్మ, సాయమ్మ, కృష్ణ రహీమత్, పండరి, వెంకట్‌గౌడ్, శేఖర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మద్నూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్ చేరుకొని గాంధీ విగ్రహానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐటీయూ నాయకులు సురేష్ గొండతో కలిసి కార్మికులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సురేష్ గొండ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి మొండి వైఖరి వీడనాడాలని, వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు పంచాయతీ కారోబార్లు పాల్గొన్నారు.



తాడ్వాయి : మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావం..

బోధన్ : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ సీనియర్ జిల్లా నాయకులు కుమారస్వామి సందర్శించి తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలనీ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ సమ్మె శిబిరంలో అధ్యక్షురాలు రేఖ, కార్యదర్శి సాగర్, సతీష్, వీరేశం, సాయిలు, శంకర్, మరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు బిక్షాటన చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు ఫస్యుద్దీన్, కార్యదర్శి బి.సాయిలు, మండలంలోని పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన జిపి కార్మికుల సమ్మె

తాడ్వాయి : గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడ్వాయి తహసీల్దార్ కార్యాయలం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, తమను రెగ్యులరైజ్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి బాపురావ్, కోశాధికారి రంగుల గంగారాం, సహాయ కార్యదర్శి పుల్లూరి స్వామి, సలహాదారు సంజీవులు, శ్రీనివాస్, కుమ్మరి అంజయ్య, దేమె శరవంగ్ రావ్, చిన్నసాయిలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకుల మద్దతు..

ఎల్లారెడ్డి : గత 19 రోజులుగా గ్రామపంచాయతీ కారోబార్లు, అకౌంటెంట్లు, సఫాయి కార్మికులు తమ వేతన బకాయిల చెల్లింపు కోసం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతూ ఎల్లారెడ్డిలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద నిరసన తెలిపారు. సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.



మద్నూర్ : ర్యాలీలో పాల్గొన్న కార్మికులు



కోటగిరి : సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌లో వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-బోధన్ టౌన్



బోధన్ పట్టణంలోని దారుణహత్య వెలుగుచూసింది. బోధన్ పట్టణంలో ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్న మాజిద్ ఖాన్ (26) అనే యువకుడిని శక్కరనగర్ చక్కెర ఫ్యాక్టరీ ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు హత్య చేసేందుకు యత్నించారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని బోధన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మాజిద్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీజ్ చేసిన ఇసుక వేలం నిర్వహణ

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని హస్గుల్ గ్రామ సమీపాన, గ్రామ శివారులో కొందరు అక్రమ ఇసుక రవాణా దారులు అనుమతులు లేకుండా మంజీర పరివాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంపులు వేసి రాత్రి సమయాల్లో లారీల ద్వారా రవాణా చేయడానికి సిద్ధం కాగా గ్రామస్తుల సమాచారం మేరకు గత ఐదు రోజుల క్రితం ఇసుక డంపులను గుర్తించిన అధికారులు ఇసుక డంపులను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంపులు సోమవారం వేలంపాట నిర్వహించగా 18,800 రూపాయిలు పలుకగా వేలంపాటలో వచ్చిన డబ్బులు ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ శీతల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

వాహన తనిఖీలు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పట్టణ సీఐ నరేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నరేష్ మాట్లాడారు.. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంటబెట్టుకోవాలని, ఫోర్ వీలర్స్ వాహనాలు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. చలాన్లు పెండింగ్‌లో ఉంటే కట్టుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాములు, ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్, ట్రాఫిక్ కానిస్టేబుల్స్ హజార్, మురళి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శరత్‌బాబు మృతికి నివాళి

నవతెలంగాణ-ఎడపల్లి

డీఎంఅండ్‌హెచ్ఓ పరిధిలో గల సీనియర్ అసిస్టెంట్‌గా డాక్టర్ శరత్‌బాబు మృతికి ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సోమవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుశీల్‌రెడ్డి, కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్, ఆయుష్ వైద్యాధికారి వెంకటేష్, ఆస్పత్రి పాలనాధికారి రాములు, సూపర్‌వైజర్లు రాజేశ్వర్, దేవమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-బోధన్‌టౌన్

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికదాడికి పాల్పడిన దుండగులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు, జిల్లా ఇంచార్జి, గంగాధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా గోపి కృష్ణ

నవతెలంగాణ-రెంజల్

బీజేపీ మండలాధ్యక్షుడు గోపికృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడానికి సహకరించిన పార్లమెంటు సభ్యులు అరవింద్, జిల్లా కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రెంజల్ ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ఎస్సైగా వచ్చిన ఉదయ్ కుమార్‌ను రెంజల్ ఎంపీటీసీ అసాద్ బేగ్, ఎంపీటీసీల భర్తలు గడ్డం రామచందర్, లింగారెడ్డి, భూమేష్, నీల బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవచారి సోమవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-బిచ్కుంద

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బిచ్కుంద మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సీహెచ్ఓ మారుతి, బాన్సువాడ డివిజన్ ఆరోగ్యబోధకులు దస్తీరాం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిలిచిన నీటిలో దోమలు తయారై దోమలు కుట్టడం వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, తదితర వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కొద్దిపాటి ముందు జాగ్రత్తతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు. స్వచ్ఛమైన క్లోరినేటెడ్ తాగునీరు మాత్రమే తాగాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రాగిణి, ఆరోగ్య సిబ్బంది సాయిబాబా, కవిత, గంగామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎల్లారెడ్డి నూతన ఆర్డీఓగా రమేష్ రాథోడ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి ఆర్డీఓగా రమేష్ రాథోడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆదిలాబాద్ జిల్లా ఆర్డీఓగా పనిచేశారు. గతంలో పనిచేసిన ఆర్డీఓ శ్రీను నాయక్ కల్వకుర్తికి బదిలీపై వెళ్లారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె..ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ 2, తెలుగు1, కంప్యూటర్ సైన్స్ 1, పొలిటికల్ సైన్స్ 1, భౌతిక శాస్త్రం1, జువాలజీ 1 ఆరు సబ్జెక్ట్‌లలో తాత్కాలిక పద్ధతిన పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా సబ్జెక్ట్‌లలో 55శాతం మార్కులతో పీజీ ఉండాలని ఆయన తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఈటీ, బోధన్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 27.07.2023వ తేదీన సాయంత్రం 4.30లోపు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఆగస్టు 1న గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కామారెడ్డిలో ఉదయం 10:30లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మద్నూర్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్

నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మద్నూర్‌లో స్పెషల్ ఫేస్ ఆన్లైన్‌లో దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశం కొరకై ఆగస్టు 01 నుంచి 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. ఈ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, ఇంగ్లీష్ మీడియం కోర్సుల గానూ ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దీక్షలో బ్రాహ్మణపల్లి రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు రైతుల నిరవధిక సమ్మె 27వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో రైతులు రాజేశ్వర్ గౌడ్, జగదీష్‌రెడ్డి, హనుమంతు, లింగం, రాజారెడ్డి, అంజయ్య, బ్రాహ్మణపల్లి రైతులు పాల్గొన్నారు.

రైతులకు లాభాలను పెంచుకోవడంలో
సహాయపడుతున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ పీవైఎస్‌ఏ

నవతెలంగాణ-నిజామాబాద్

గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ కంపెనీ పీవైఎస్‌ఏ బ్రాండ్ ఉత్పత్తులు పత్తి రైతులకు ఎకరాకు అయ్యే సాగు ఖర్చును గణనీయంగా తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొంది. ఈసందర్భంగా జీఏవీఎల్, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్, సీఈఓ రాజవేలు ఎన్ కె మాట్లాడుతూ... జీఏవీఎల్ వద్ద తాము పర్యావరణ అనుకూల పత్తి ఉత్పత్తి పద్ధతులను ప్రోత్సహిస్తూ వ్యవసాయ ఉత్పాదకత, లాభదాయకతను మెరుగు పరచడానికి కట్టుబడి ఉన్నామన్నారు. తమ పీవైఎస్‌ఏ బ్రాండ్ ఉత్పత్తులు పత్తి రైతులకు గణనీయంగా ఖర్చును తగ్గిస్తున్నాయన్నారు. తద్వారా వారి ఆర్థిక విజయానికి సహకరించడం తాము గౌరవంగా భావిస్తున్నామన్నారు. భారతీయ రైతుల జీవనోపాధిని పెంచడమే తమ అంతిమ లక్ష్యం కాబట్టి, పీవైఎస్‌ఏ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో కింద కొత్త సాంకేతికతలను పరిచయం చేయడానికి, కొత్త మిశ్రమాలు, సూత్రీకరణలను ఆవిష్కరించడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. పీవైఎస్‌ఏ బ్రాండ్ విజయానికి 15 సహ- బ్రాండెడ్ కంపెనీలు, బహుళజాతి సంస్థలు, భారతీయ కంపెనీలతో కూడిన వ్యూహాత్మక భాగస్వామ్యం కారణమని చెప్పవచ్చన్నారు. పీవైఎస్‌ఏ బ్రాండింగ్ నాణ్యత నియంత్రణను నిర్ధారిస్తుందన్నారు. గోద్రెజ్, దాని సహ-మార్కెటర్ల మధ్య సహకారాన్ని మరింత పటిష్టం చేస్తూ రైతుల మధ్య నమ్మకాన్ని కలిగిస్తుందని ఆయన చెప్పారు.

కార్మికుల సంఖ్యను పెంచాలి

- **ఇతర సమస్యలూ పరిష్కరించాలి**
- **ఆస్పత్రి ముందు ధర్నా**

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ జిల్లా ఆస్పత్రిలో కార్మికుల సంఖ్యను పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బోధన్ జిల్లా ఆస్పత్రి ప్రధాన గేటు ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శివకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు వై.ఓమయ్య మాట్లాడుతూ.. బోధన్ జిల్లా ఆస్పత్రికి ప్రస్తుతమున్న బోధన్ పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా అవుట్ పేషంట్స్ ఓపీ, ఇన్ పేషెంట్, ఐపీ కొరకు పెద్ద మొత్తంలో పేషెంట్లు పెరుగుతున్నందున బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని 250 పడకలకు పెంచాల్సిన అవసరం ఉన్నదని, దీంతోపాటు ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రధానంగా ఆస్పత్రిలో కార్మిక సంఖ్యను పెంచాలని, కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనం వెంటనే ఇవ్వాలని, 2023 మే 1న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ నెలకు రూ.వెయ్యి పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్, సాయిలు, నాగమణి, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావ్

నవతెలంగాణ-తాడ్వాయి

తియ్యటి మాటలతో ప్రజలను మభ్య పెడుతూ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ చేపట్టిన ధర్నాకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ..

ఆగస్టు 30లోపు నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వకపోతే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి నిరుపేదలకు పంపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తీయటి మాటలతో ఎన్నికల ముందు ప్రజలకి మభ్య పెడుతూ ప్రజలని ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేస్తున్నారన్నారు. ఓట్ల కోసం మాత్రమే కేసీఆర్ కొత్త కొత్త పథకాలని ప్రవేశపెడుతున్నారని చెప్పారు. కులవృత్తుల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో గులాబీ కండువా కప్పుకున్న వారికే రుణాలు వస్తాయని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లపై పోరాటాలు చేస్తానని తెలిపారు. కామారెడ్డిలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కట్టి నాలుగేండ్లు గడిచినా ఏ ఒక్క పేద వారికి ఎందుకు పంపిణీ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

మహిళ సంఘ సభ్యులకు బ్యాంకు రుణం మంజూరు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ సంఘ సభ్యురాలు లతీఫా బేగంకు కేంద్ర ప్రభుత్వంచే చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు 6.5 లక్షల రూపాయల రుణం మంజూరి చేసినట్లు ఐకేపీ ఏపీఎం వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో యూబీఐ బ్యాంకు మేనేజర్ వెంకట రమణతో పాటు ఆయన లబ్ధిదారులైన లతీఫాబేగంకు చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజీ 2023-24 సంవత్సరానికి గానూ 577 మహిళా సంఘాలకు రూ.3064.35 లక్షలు రూపాయలు మంజూరయ్యాయని అన్నారు. ఇప్పటి వరకు 177 సంఘాలకు రూ.900.02 లక్షల రూపాయలు అందించి లక్ష్యం సాధించినట్లు తెలిపారు. అలాగే 227 న్యూ ఎంటర్ ప్రైజెస్ వ్యాపారుల కోసం 227 మంది సంఘ సభ్యులను గుర్తించినట్టు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం 12మంది లబ్ధిదారులను గుర్తించి రూ.40వేలు రుణం మంజూరికి ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. చిన్న పరిశ్రమలకు సంబంధించి 11మంది సభ్యులను గుర్తించి రుణం మంజూరుకు బ్యాంకుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆంధ్రబ్యాంకు ద్వారా ఒక సభ్యురాలికి 6.50 లక్షల రూపాయల మంజూరు చేసినట్టు వివరించారు. మండల సమాఖ్య నుంచి పెంటకలాన్ గ్రామ సంఘానికి 2లక్షలు మంజూరి చేశామని, కావున సంఘం సభ్యులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, ధనలక్ష్మి, ఖైరున్నీసా, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మేనేజర్

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

- తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మంధర్న గ్రామంలో ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరుచుకున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరి చేసి న్యాయం చేయాలని రైతు సమితి మాజీ మండలాధ్యక్షులు బుద్దె రాజేశ్వర్ అన్నారు. సోమవారం మందర్న గ్రామస్థులు కలిసి ఆయన సాలూర తహసీల్దార్ మమతకు వినతిపత్రం అందించారు. ఆయన వెంట సర్పంచ్ గంగాధర్ ఉన్నారు.

సోమలింగాల ఆలయంలో అన్నదానం



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గుట్ట ప్రాంతంలో గల సోమలింగాల ఆలయంలో అధికమాసం దొండమైన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి అప్ప, గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి కాంగ్రెస్ మండలాధ్యక్షునిగా పోసానిపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం నియామకపత్రాన్ని మాజీ మంత్రి షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షులు కైలా శ్రీనివాస్, ఎల్లారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... 'నాపై నమ్మకం ఉంచి, మండల పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు, పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని నిర్వహిస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు' అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

30వేల నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

ఆచార్య స్వామి ప్రణవానంద మహారాజు ఆశీస్సులతో భారత సేవాశ్రమ సంఘం ప్రతినిధి వెంకటేశ్వర నంద ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలకు 30,000 నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని తెలిపారు. నోటు పుస్తకాలను విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే. గంగాకిషన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

- మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం

నవతెలంగాణ-మద్నూర్


ఆలయ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం అన్నారు. సోమవారం మండలంలోని పెద్దఎక్లారా గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ మందిర ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన గ్రామ పెద్దలతో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి గ్రామస్తుల సమిష్టి కృషి ఎంతో అవసరమని, అందరూ కలిసిమెలిసిగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆలయ పరిశీలన మద్నూర్ మాజీ సొసైటీ చైర్మన్ పండిత్ రావ్ పటేల్, బస్వంత్ పటేల్, ప్రల్లహద్ పటేల్, వార్డు మెంబర్ సిద్దప్ప పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్షన్ సాధన పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

సీపీఎస్ ఎంప్లాయిస్‌తో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రలో భాగంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రథయాత్ర పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించినట్టు టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మధ్యాహ్నం 2గంటలకు రాజారెడ్డి గార్డెన్స్, కామారెడ్డిలో జిల్లాస్థాయి సీపీఎస్ ఎంప్లాయిస్ సమావేశం ఉంటుందని, అలాగే అభి నహితో కబీ నహి అనే నినాదంతో ఆగస్టు 12న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశానికి ఆగస్టు 12 నాటి సమావేశానికి సీపీఎస్ ఎంప్లాయిస్‌లందరూ కుటుంబ సమేతంగా హాజరుకావాలని టీ.యస్.సి.పి.ఎస్.ఈ.యు జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ ప్రధానోపాధ్యాయులు సిద్దికి, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బాల్ సింగ్, మోహన్, మండలాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి దామోదర్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలభిషేకం



లింగంపేట్ : చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

నవతెలంగాణ-లింగంపేట్/రాజంపేట్

రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వీఆర్ఏలకు పేస్కేల్ జీవోను విడుదల చేయడంతో సోమవారం మండల వీఆర్ఏల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాసులు కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటీ రమేష్, ఎంపీపీ గరీబునిస నయీమ్, వీఆర్ఏలు లక్ష్మీనారాయణ, ముజీబ్, రవి, బాలరాజు, బలరాం, లక్ష్మణ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల మండలాధ్యక్షుడు బోయిని రవికుమార్ మాట్లాడుతూ.. వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని, అదేవిధంగా పేస్కేల్‌ను పెంచడంతో చాలా సంతోషంగా ఉన్నామని సీఎం కేసీఆర్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పందుల నరసింహులు, కోశాధికారి బాల్‌లింగం, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రమేష్, బాబు సభ్యులు ధర్మపురి, శ్రీకాంత్, కిష్టయ్య, రవి, భాస్కర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐటీలో మేటి తెలంగాణ

- సాంకేతిక పరిజ్ఞానంలో తెలంగాణను మంత్రి కేటీఆర్ అగ్రగామిలో నిలిపారు : బీఆర్ఎస్
- ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సాంకేతిక పరిజ్ఞానంలో తెలంగాణ రాష్ట్రాన్ని మంత్రి కేటీఆర్ దేశంలో అగ్రగామిగా నిలిపారని పలువురు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఐదు వేల మొక్కలు నాటి, కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రామారెడ్డి : మండలంలోని రెడ్డిపేట్, రామారెడ్డిలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఎడపల్లి మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో వేడుకల్లో ఎంపీపీ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పోచారం గ్రామంలో వేడుకలు చేపట్టారు.

పిట్లం : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

దోమకొండ : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గాంధ్ర మధుసూదన్‌రావు, ఎంపీపీ కనుగంటి శారద నాగరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు.

గాంధారి : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు చేత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సదాశివనగర్ : మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల మధ్య కేటీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలో బర్త్‌డే వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మేయర్ తదితరులు..



డిచ్‌పల్లి మండలంలో..

లింగంపేట్ : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మండలాధ్యక్షులు దివిటీ రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

బోధన్ టౌన్ : బీఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో చింతకుంట గ్రామంలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

తాడ్వాయి: బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మద్ది మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేజీబీవీలో జన్మదిన వేడుకలను నిర్వహించారు.

డిచ్‌పల్లి : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హయంలోనే రాష్ట్ర నలుమూలల ఐటి రంగం పురోభివృద్ధి సాధించిందని రాబోవు రోజుల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలుస్తుందని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, డిచ్‌పల్లి,ఇందల్ వాయి బిఆర్ఎస్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, చిలువెరి గంగా దాస్, సినియర్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు, ఇందల్ వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద కేక్ లు కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘంంగం మండలాల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, మోహన్ రెడ్డి, ఎంపిటీసీల ఫోరం అధ్యక్షులు గండుగుల సాయిలు, దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, రూరల్ ఎస్సి సెల్ అధ్యక్షులు పాశం కుమార్, నీరడి పద్మారావు, ఎంపిటిసి చింతల దాస్, మారంపల్లి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలం కేంద్రంలోని దివ్యంగుల పునరవాస కేంద్రంలో మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎంపీపీ విమల రాజు, జడ్పిటిసి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లను పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ కేక్ కట్ చేశారు. మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి పండ్లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్‌లు గడ్డం స్వామి, నునావత్ లస్కర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల క్యాంపు కార్యాలయంలో మంత్రి, బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ , నుడా చైర్మన్ చామకూర ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు, ఎనుగందుల మురళి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మోపాల్:మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, జడ్పిటిసి కమలా నరేష్, ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు మరియు ఎంపీపీ లతా కన్నీరాం, సర్పంచులు. ఇందురీ సిద్ధార్థ, లతా భూషణ్, శ్రవణ్, ఉమాపతిరావు, నిమ్మల మోహన్ రెడ్డి , కెంపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు

నందిపేట్ : పట్టణంలోని ఆలయాలలో మసీదులలో ప్రత్యేక పూజలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మచ్చుల సాగర్ మాట్లాడుతూ.... కేటీఆర్ జన్మదిన సందర్భంగా నందిపేట్ పట్టణంలో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మచ్చర్ల సాగర్, ఉప సర్పంచ్ భరత్, మాజీ సర్పంచ్ మదర్ బాయ్, మండల గోసంగి సంఘం అధ్యక్షులు రాజశేఖర్,వార్డ్ మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎడపల్లి : పోచారం గ్రామంలో పండ్లు పంపిణీ..



గాంధారి మండల కేంద్రంలో..

బీఆర్ఎస్ ఉంటే ఇండ్లు రావు

- నేను కాదు.. కేసీఆర్‌తో ముక్కురాపిస్తా
- నాపై పోటీ చేయని కవిత గురించి మాట్లాడాను : ఎంపీ అరవింద్
- 'డబుల్ ఇండ్లు' ఇవ్వకుంటే కబ్జా : ధన్‌పాల్



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ఆధ్వ ర్యంలో నిజామా బాద్ నగరంలోని ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లా డుతూ... ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నంతకాలం పేదలకు ఇండ్లు రావు అని, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎన్నుకున్నన్ని రోజులు పేదలకు పక్కా ఇండ్లు రానే రావు ఎద్దేవ చేశారు. డబుల్ బెడ్ రూంలు ఇస్తామని చెప్పుకుని రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఇచ్చిన ఆ హామీని మర్చిపోయారని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు 18 వేల 500 కోట్లు కేటాయించిన కేసీఆర్ ఆ నిధులను పక్క దారి మళ్లించారు అని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అని చెప్పి.. దాని రూ.3 లక్షలకు కుదించిన పాపాత్ములు కేసీఆర్, హరీష్ రావు అని ఆరోపించారు.ఖాళీ జాగా ఉంటే రూ.3 లక్షలు అంటూ కొత్త డ్రామా తెర లేపారు అన్నారు. డబుల్ బెడ్ రూంల స్కామ్ డబ్బులతో లిక్కర్ స్కామ్ చేసిన చరిత్ర కవితది అని అన్నారు. కవితది ఐరన్ లెగ్.. ఆమె తో సహవాసం చేస్తే జైలుకెళ్లటం ఖాయం అన్నారు.



బిజెపికి ఓట్లేస్తేనే డబుల్ బెడ్ రూంలు వస్తాయి. ప్రపంచంలోనే అతిపెద్ద అవినీతి పరురాలు కల్వకుంట్ల కవిత అని సంచలన ఆరోపణలు చేశారు. నేను ముక్కు నేలకు రాయటం కాదు, కేసీఆర్ తో రాకిపిస్తా అని సవాల్ చేశారు. మంత్రి ప్రశాంత్ రెడ్డికి సోయి లేదు.. భీంగల్ లో బస్సు డిలో కట్టలేనోడు, డబుల్ బెడ్ రూంలు కడ్తడా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ ఆస్తులు మొత్తం జీవన్ రెడ్డికి అప్పచెప్తే, ఆర్టీసీ లాభాల్లో ఎట్లా ఉంటది అని అన్నారు. కవిత తనపై పోటీ చేయటానికి భయపడుతుందని అన్నారు. కవిత మీద మాట్లాడి టైమ్ వేస్ట్ చేసుకోవటం అనవసరం అంటూ ఎంపీ అరవింద్ వ్యాఖ్యానించారు.

ఇండ్లు ఇవ్వకుంటే కబ్జా : ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వకుంటే పేదలతో కబ్జా చేయిస్తామని, పేదలకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిర్మాణం పూర్తయిన ఇండ్లు లబ్దిదారులకు ఏడాది క్రితం నుంచి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే.. ప్రాసెస్ చేస్తున్నామని అన్నారని, ఇంకెన్ని రోజులు ప్రాసెస్ చేస్తారని ప్రశ్నించారు.

ప్రతి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- లక్ష నుంచి కోటి రూపాయల వరకు సబ్సిడీతో అందించవచ్చు
- సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి హాజరై మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు అభివృద్ధికోసం ప్రతి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు చేసి వారిని ధనవంతులు చేయాలని పేర్కొన్నారు. బేకిరీలో తయారు చేసే పదార్థాల యంత్రాలకు, ఆయిల్ మిల్లు, రైస్ మిల్లుకు, పేలాల తయారీ, పసుపు యంత్రానికి, పాలపదార్థాల తయారీకి, పచ్చళ్ళ తయారీకి, తదితర ఆహార శుద్ధి యంత్రాలకు పరిశ్రమల శాఖ నుంచి లక్షకు 30 నుంచి 35శాతం సబ్సిడీతో బ్యాంకు ద్వారా లక్ష నుంచి కోటి రూపాయల వరకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు, గ్రామ సంఘం ఆర్థిక లావాదేవీలపై వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న మేనేజర్ మారుతి

లక్ష్యం కోసం నిర్విరామ కృషి అవసరం

- ఏటిఎస్ శ్రీనివాస్
- మెరిట్ సాధించిన విద్యార్థినిలకు బంగారు ఉంగరాల బహుకరణ



బంగారు ఉంగరాలు పంపిణీ చేస్తున్న ఏటీఎస్ శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

లక్ష్యం సాధించాలంటే నిర్విరామ కృషి అవసరమని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటిఎస్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో పది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మెరిట్ సాధించిన ఇద్దరి విద్యార్థినిలకు బంగారు ఉంగరాలను సోమవారం బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే కావలసిన సూత్రాలను తెలియజేశారు. సమయం విలువను విద్యార్థులు గుర్తించాలని అన్నారు. గురువులను, పెద్దవాళ్లను గౌరవించడం నేర్చుకోవాలని, మహనీయుల జీవిత చరిత్రలతో స్ఫూర్తిని పొందాలని అన్నారు. కఠోర శ్రమ, కచ్చితత్వం, ముందుచూపుతో ఉంటే విజయాలు దరిచేరతాయని అన్నారు. విద్యార్థులకు ప్రేరణ కలిగించినందుకు ప్రిన్సిపల్ సుహాసిని రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏడవ తరగతి నుండి 12వ తరగతి విద్యార్థినులకు ఏటీఎస్ శ్రీనివాస్ ఇచ్చిన మోటివేషనల్ స్పీచ్ ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పి వైస్ చైర్మన్ రజిత యాదవ్, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, ఎంపీటీసీ వనజ నాగరాజు, నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా అడుగు వేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలంటే ప్రతి అడుగును ప్రణాళిక బద్ధంగా వేయాలని ఇంపాక్ట్ మోటివేటర్ బాంధవ్య అన్నారు. సోమవారం మండలంలోని హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు టైం మేనేజ్మెంట్, జీవిత లక్ష్య నిర్ధారణ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి మనిషికి ఒక లక్ష్యం ఉంటుందని దానికి అనుగుణంగా అడుగు వేయాలని అన్నారు. జీవిత ఎదుగుదలలో సమయం పాత్ర చాలా కీలకమని, ప్రతి నిమిషం ఎంతో విలువైందని అన్నారు. పోసే పదార్థాన్ని బట్టి కప్పు విలువ మారుతున్నట్లే, తీసుకునే నిర్ణయం సక్రమమైతే జీవితంలో అత్యున్నత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. పాఠశాలస్థాయి నుండే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని దానికి అనుగుణంగా అడుగులు వేయాలని, ప్రణాళికగా లేని అడుగులు వేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. ప్రత్యక్ష ఉదాహరణలతో బోధించిన విషయాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్ బాంధవ్యకు ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె న్యాయమైంది



మోపాల్‌లో..

- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి
- 27 తేదీన చలో కలెక్టరేట్

నవతెలంగాణ-విలేకరులు

మోపాల్:మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయమైందని, ధనిక రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో కనీస కార్మికులకు సదుపాయం కల్పించే సోయిలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. జీపీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత చేసిన తక్కువే అని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వానికి గవర్నమెంట్ బంగ్లాలు కట్టించుకునే స్తోమత ఉంటది..కార్మికుల డిమాండ్లు అమలు చేయడంలేదని అన్నారు. కొద్దిరోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే న్యాయమైన కోరికలు నెరవేరుతాయని తెలిపారు. శ్రమకు కష్టానికి తగ్గ ఫలితం ఖచ్చితంగా వస్తుందని అ న్నారు. ఇటువంటి దౌర్భాగ్య ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేదనీ కేవలం మన తెలంగాణలోనే దాపురించిందని తెలిపారు. పార్టీ తరపున పెద్ద మొత్తంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన అన్నారు. కిసాన్‌ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి మాట్లాడుతూ 19 రోజులుగా దీక్ష చేస్తున్నా ఏ ఒక్క నాయకుడు కూడా పరామర్శించింది లేదని, కనీసం వారి తరపున పోరాటం చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సాయి రెడ్డి, చమకురు అనిల్ రెడ్డి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

నవీపేట్:ప్రజల సహకారంతోనే గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు నాయకులు నాయక్ వాడి శ్రీనివాస్, మీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామాలలో పారిశుధ్య సమస్యలు ఏర్పడి అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే ప్రజల మద్దతుతోనే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, భుజంగరావు, శీను, గంగామణి, ఆయా గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి కార్మికులు నిరసన తెలిపారు. నిరవధిక సమ్మె శిబిరం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, పంచాయతీ ఉద్యోగ, కార్మికుల డిమాండ్లపై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి క్రమబద్ధీకరించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను కార్యదర్శులుగా నియమించాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం అందించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కారోబార్లు పాల్గొన్నారు.

ఆర్మూర్ :సఫాయి కార్మికుల పట్ల రాష్ట్ర సర్కారు నిర్లక్ష్య వైఖరి విరినాడి సమ్మె నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు , మండల సిఐటియు అధ్యక్షులు కుతాడీ ఎల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె శిబిరంలో దాసు పాల్గొని మాట్లాడుతూ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో ఈనెల 22న చర్చలకు వెళ్లగా ముందు సమ్మె విరమణ చేయాలని, కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన మాట్లాడగా, కార్మికులకు ఏదైనా భరోసా కల్పిస్తే, విరమణ ఆలోచిస్తామని, లేనిచో సమ్మె విరమణ ఎలా సాధ్యమవుతుందని తెలిపారని అన్నారు. ఈనెల 27 తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపును ఇచ్చిందని, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కవిత మంత్రివర్యులు ప్రశాంత్ రెడ్డి సఫాయికార్మికుల సమ్మె నివారణకు చొరవ తీసుకొని కేసీఆర్ తో మాట్లాడాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ జేఏసీ నాయకులు పోశెట్టి, రాంపూర్ పోసాని, మచ్చర్ల గంగాధర్, ఖానాపూర్ గంగాధర్, ఇస్సపల్లి నర్సు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న గ్రామ పంచాయితీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. సమ్మెతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయని అన్నారు. ధరలకు అనుగుణంగా వేతనానలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని తీసేయాలని, వారసత్వ పనిని కొనసాగించాలని, ఎమ్మెల్యేల జీతాలు పెంచుకున్నట్టే కార్మికుల జీతాలు పెంచాలని, సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు మనోజ్, రవీందర్, ఇఫ్టు నాయకులు జెపి గంగాధర్, భారతి పాల్గొన్నారు.



నవీపేట్‌లో..



కమ్మర్‌పల్లిలో..

లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ 6వ ఇన్స్టాలేషన్ కార్యక్రమం సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిస్టిక్ గవర్నర్ లయన్ వేమూరి లక్ష్మీ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ లయన్. శ్రీనివాస్ రావు ఇండక్షన్ ఆఫీసర్ లయన్ కిషోర్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జెంటిల్ కిడ్స్ గుజరాతి గంగా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి లయన్ అల్జాపూర్ రాజేష్, కోశాధికారి లయన్ కుంటాల నరేందర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ సభ్యులందరూ, లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం పి ఎస్ టి లు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షులుగా గడ్డం సంతోష్ రెడ్డి



నవతెలంగాణ-ముప్కాల్

జిల్లాలో పలు మండలాల బీజేపీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుల పేర్లను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మీనర్సయ్య విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. జిల్లాలో దాదాపు 12 మండలాల్లో బీజేపీ అధ్యక్షుల మార్పులను చేపట్టారు. అందులో భాగంగా ముప్కాల్ మండల బీజేపీ అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన గడ్డం సంతోష్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి ఇచ్చినందుకు జిల్లా పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తానని అన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న సర్పంచ్, హెచ్ఎం

మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేపూర్ ఉపాధ్యాయులు సంగెం అశోక్ పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా సోమవారం సర్పంచ్ టీసి సాయన్న, ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయన్న మాట్లాడుతూ.. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మధుసూధన్, పాఠశాల ఉపాధ్యాయులు సురేందర్, అనసూయ, గంగాధర్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పున్నమిరెడ్డి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన పున్నమిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి సోమవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, వసంత్ రావు, గన్న లక్ష్మణ్, సైకిల్ అక్బర్ మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా ఆర్. సురేష్ నాయక్



నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని దుర్గానగర్ తండాకు చెందిన రమావత్ సురేష్ నాయక్‌ను మండల అధ్యక్షునిగా సోమవారం నియమించారు. సురేష్ నాయక్ గతంలో ఏబీవీపీ విద్యారి నాయకునిగా బాధ్యతలు నిర్వహించారు. బీజేపీ మండల కార్యదర్శిగా, మండల ఉపాధ్యక్షునిగా బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శిగా పార్టీలో పనిచేశారు. బీజేపీ మాక్లూర్ మండల అధ్యక్షునిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మి నర్సయ్య, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు రాకేష్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, విజయ భారతి, పాలేపు రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుడు మృతికి సంతాపం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మోహన్‌లాల్ మృతి పట్ల సోమవారం యూనివర్సిటీలలో సంతాప సభను ఏర్పాటు చేసినట్టు తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు వి దత్తాహరి అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకుల ను రెగ్యులరైజ్ చేసి ఉంటే ఈ రోజు ఒక కాంట్రాక్ట్ అధ్యాపకుడు మృతి చేందకపోయే వారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ యూనివర్సిటీలో ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరి సమస్యలు పరిష్కారించాలని ఇచ్చిన హామీ నేరవేర్చాలని అయన పేర్కొన్నారు.

రెండు పడుక గదుల ఇండ్లు లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-బాల్కొండ (కమ్మర్ పల్లి)

బాల్కొండ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్ల ఎంపికపై సోమవారం తహశీల్దార్ వినోద్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. మండల కేంద్రం లోని ప్రజా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, జడ్పీటీసీ దాసరి లావణ్య వెంకటేష్, సర్పంచ్ భూస సునీత నరహరి, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై మాట్లాడారు. సకల సౌకర్యాలతో 176 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఆగష్టు నెలలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు మామిడి దివ్య రాకేష్, కన్న లింగవ్వ పోశెట్టి, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ, ఉపసర్పంచ్ షేక్ వాహబ్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మాజారోద్దీన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షాహిద్, వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిప్పెరా అశోక్, ఉపాధ్యక్షుడు అర్కరి గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు కీలకం

ఇంటింటా పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

మానవ మనుగడకు మొక్కలే కీలకమని నడిపల్లి సర్పంచ్ కులచారి సతీష్‌రావు, గ్రేడ్ వన్ కార్యదర్శి కిషన్ రావు అన్నారు. సోమవారం నడిపల్లి, గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో గ్రామంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు పంట పొలాల వద్ద కూడా మొక్కలు నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్‌గౌడ్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పీఆర్ఓగా పున్నయ్య నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నియామక పత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఐఏఎస్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి సోమవారం పారిపలన పోస్టులకు పలువురికి నియామక ఉత్తర్వులను అందజేశారు. ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్‌ను డైరెక్టర్ ఆడిట్ సెల్, డాక్టర్ అతిక్ సుల్తానా గోరిని జాయింట్ డైరెక్టర్ ఆడిట్ సెల్, డాక్టర్ ఏ. పున్నయ్యను డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీస్‌గా నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ నియామకపు ఉత్తర్వులు అందుకున్న ప్రోఫేసర్లు గంట చంద్రశేఖర్, అతిక్ సుల్తానా గోరి, పున్నయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగం పంచుకుంటామని వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.